ప్రజాశక్తి
బుధవారం 17 జనవరి 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

గట.. గట.. గట

◆ పండగ మూడు రోజులూ తాగిన మద్యం రూ.25 కోట్లు
◆ రూ.10 కోట్ల మాంసం విక్రయాలు

మందు సీసాతో వెళ్తున్న వ్యక్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పండగల్లో పెద్ద పండగ సంక్రాంతి. దీనికి ప్రత్యేక స్థానం ఉంది. సంప్రదాయబద్ధ పండగగా దీనికి పేరున్నా క్రమేపీ దీని తీరు మారుతోంది. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో మద్యం ఏరులై పారడం పరిపాటిగా మారింది. ఈ సంక్రాంతికీ విశాఖలో మాంసం, చేపల విక్రయాలు భారీగా జరిగాయి. మాంసాహారులకు ప్రీతిపాత్రమైన మంగళవారం కనుమ రావడంతో వారి ఎంజాయ్‌మెంట్‌కు అవధుల్లేకుండా పోయింది. జిల్లా మొత్తంగా పండగ మూడు రోజులూ సుమారు రూ.25 కోట్లు విలువజేసే మద్యాన్ని జనం తాగేశారు. ఒక్క నగర పరిధిలోనే రూ.15 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయి. వైన్‌షాపులు, బార్లు ముందు మందుబాబులు బారులు తీరారు. బార్ అండ్ రెస్టారెంట్లను ఈ మూడు రోజుల కోసం ప్రత్యేకంగా అలంకరించారు. నగర శివారు ప్రాంతాల్లోని బార్ అండ్ రెస్టారెంట్లలో ప్రత్యేక ఆఫర్లు పెట్టారు. క్వార్టర్ కొంటే రూ.10 తగ్గింపు, నాలుగు శాంపిల్స్ తాగితే ఒక శాంపిల్ ఉచితం అంటూ మందు బాబులను ఆకట్టుకునేలా మద్యం దుకాణదారులు ఆఫర్లు కొనసాగించారు.

నగరంలోని మద్దిలపాలెం, పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు, కోటవీధి, రెల్లివీధి, కొత్తజాలారిపేట, కలెక్టరేట్, ఆర్‌టిసి కాంప్లెక్స్, అక్కయ్యపాలెం, పెదవాల్తేరు, కంచరపాలెం, మధురవాడ తదితర ప్రాంతాల్లో మద్యం దుకాణాలను తెల్లవారు జామునుంచే తెరిచివుంచారు. మందుబాబులు మద్యాన్ని బహిరంగంగా రోడ్లపై సేవిస్తున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవని పాదచారులు విమర్శలు గుప్పించారు. మద్యం పూటుగా తాగి అనేకమంది మద్యం షాపులున్న ప్రాంతాల్లోనే రోడ్లపై నిషాలో పడి కనిపించారు. కొంతమంది మద్యం బాబులు తాగిన మత్తులో మిగతా 2లో..

మాంసం దుకాణం వద్ద జన రద్దీ

జనం లేక బోసిపోయిన ద్వారకా బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు

నగరం ఊరెళ్లింది..!

◆ స్వస్థలాలకు తరలిన ప్రజలు ◆ బోసిపోయిన రహదారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహా విశాఖ నగరం మంగళవారం బోసిపోయింది. నగరవాసుల్లో అత్యధికులు సంక్రాంతి పండగకు స్వస్థలాలకు తరలివెళ్లిపోవడంతో నిర్మానుష్యంగా మారింది. నిత్యం వాహనాల మోత, ట్రాఫిక్ జామ్‌లతో పద్మవ్యూహాన్ని తలపించే నగరంలోని రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. వారం రోజులుగా అడుగుపెట్టేందుకు కూడా ఖాళీలేని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్లలో జనాలు కరువయ్యారు, ప్రయాణికులు లేకపోవడంతో నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ ఖాళీగా వెళ్లాయి.

సంక్రాంతి పండగ తెలుగు రాష్ట్రాల ప్రజలకు అత్యంత ప్రధానమైది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తప్పనిసరిగా ఈ పండగకు తమ స్వస్థలాలకు వెళ్లడం ఆనవాయితీ. మిగిలిన పండుగలకు ఒకరోజు మాత్రమే సెలవు దొరికితే.. సంక్రాంతికి మాత్రం మూడు రోజులు సెలవు కావడం, బంధువులు, కుటుంబ సభ్యులు ఒకే చోటుకు చేరడం ఉంటుంది కాబట్టి స్వస్థలాలకు వెళ్లేందుకు ప్రతిఒక్కరూ ఇష్టపడతారు. నగరంలో నివాసం మిగతా 2లో..

పండుగ వేళా.. సమ్మె శిబిరాల్లోనే...

▶ వార్త 8లో..

చంద్రబాబు నిర్దోషి అని నిర్ధారణ కాలేదు

▶ వార్త 2లో..

చెరుకు రైతుల ఆందోళన

▶ వార్త 7లో..



ఎయు గ్రౌండ్‌లో కొలువుదీరిన మెరైన్ ఎగ్జిబిషన్

విశాఖలో మెరైన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

▶ వార్త 2లో..

అక్రమాలకు పాల్పడి తిరిగి విమర్శలా..?

◆ బిజెపి ఎంపీ జివిఎల్ తీరు సిగ్గుచేటు
◆ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సంక్రాంతి సంబరాల పేరిట అక్రమంగా లక్షల రూపాయలు దండుకొని తిరిగి వామపక్ష పార్టీలపైన బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావు తప్పుడు విమర్శలు చేయడం దుర్మార్గమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ఎంపీ వ్యాఖ్యలను ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఏయే సంస్థల నుంచి ఎన్నెన్ని లక్షలు వసూలు చేశారో బహిరంగంగా ప్రకటించాలని జివిఎల్‌ను డిమాండ్ చేశారు. ఒక్క స్టేట్ బ్యాంక్ నుంచే రూ.65 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసి సంక్రాంతి సంబరాలకు వినియోగించడం వాస్తవం కాదా ?, మీ అక్రమ దందాపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పకుండా దాటవేశారు ? అని జగ్గునాయుడు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు మీడియా ద్వారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల సంక్షేమం, అత్యవసర సదుపాయాల కల్పన, ముఖ్యంగా విద్య, ఆరోగ్యం వంటి సేవలపై ఖర్చు చేయాల్సిన సిఎస్‌ఆర్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఎస్‌బిఐ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అధికారులను బెదిరించి వాటిని జివిఎల్ తన ప్రాపకానికి, బిజెపి రాజకీయ లబ్ధికి వినియోగించుకోవడం ఏ భారతీయ సంస్కృతికి నిదర్శనం అని ప్రశ్నించారు.

ప్రజా సంస్థల సొమ్మును కొల్లగొట్టాలని, ఆ నిధులను బిజెపి లేదా మీ వ్యక్తిగత స్వార్థానికి వినియోగించుకోవొచ్చని ఏ భారతీయ ధర్మం చెప్పిందని అడిగారు. మీ పార్టీ నిర్వహించే కార్యక్రమానికి మీ పార్టీ ఖర్చులు భరించకుండా, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి నిధులు వసూలు చేయడం చట్ట విరుద్ధం కాదా ? ఇది రాజకీయ అవినీతి కాదా ? అని ప్రశ్నించారు. జివిఎల్ అక్రమ దందాపైనా, నిబంధనలకు విరుద్ధంగా వివిధ సంస్థలు ఇచ్చిన లక్షల రూపాయాల సొమ్ముపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమృతమూర్తికి అశ్రునివాళి



ప్రేమ, అప్యాయతలకు
మారుపేరుగా నిలిచి
మంచి వ్యక్తిత్వంతో
మా అందరి హృదయాలలో
సుస్థిర స్థానాన్ని సంపాదించిన
ఆత్మీయుని అకాల మరణానికి
చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కందుల వెంకటస్వామి గారు
ప్రెసిడెంట్: గాజువాక బార్ అసోసియేషన్
విశాఖ జిల్లా TDP లీగల్‌సెల్ పార్లమెంట్ అధ్యక్షులు
ప్రముఖ న్యాయవాది, గాజువాక

జననం: 15-07-1964 మరణం: 03-01-2024

భార్య: కందుల రమాదేవి

వదిన: అబ్బూరి లక్ష్మి-వెంకటరావు
బావమరిది: గట్టినేని శ్రీనివాసరావు-శిరీష
మరదలు: సుజాత - గోపాలం సంజీవరావు
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

కుమారుడు : కందుల భగీరథ
కోడలు : ప్రవళిక
కుమార్తె : సాయిగాయిత్రీ
అన్నయ్య: సాంబశివరావు - నగరాజ
తమ్ముడు: ప్రభాకరరావు-సుధ
అక్క: మద్దాలి శివకుమారి - సుబ్బారావు

పెద్దకర్మ: తేది: 17-01-2024 బుధవారం గాజువాక నందు జరుగును.

మొదటి పేజీ తరువాయి..

గట.. గట.. గట

ఊగుతూ, జోగుతూ పాదచారులను ఇబ్బందులకు గురిచేశారు. మద్యం దుకాణాల నిర్వాహకులు మూడు రోజులు ముందుగానే భారీ స్టాక్ తెచ్చుకొని సిద్ధంగా ఉంచారు. మందుబాబుల వ్యసనాన్ని, అవసరాలను మద్యం షాపుల ద్వారా ప్రభుత్వం భారీగానే సొమ్ము చేసుకుంది. బార్లు, ఎసి రెస్టారెంట్లలో అయితే ఎసి ఛార్జీలు కలుపుకొని ఒక ఫుల్ బాటిల్‌పై ఏకంగా రూ.120 పెంచేశారు. ఇక బీర్ విషయానికొస్తే ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.15 వరకూ పెంచి విక్రయించారు. పండగ నెపంతో బార్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా ధరలను పెంచినా పోలీసులుగానీ, ఎక్సైజ్ అధికారులుగానీ కన్నెత్తి కూడా చూడలేదు. నగరంలో 75 మద్యం దుకాణాలు, 101 బార్లు ఉండగా అవన్నీ మందుబాబులతో రద్దీగా కనిపించాయి.

పోటాపోటీగా మాంసం విక్రయాలు

పండగ నేపథ్యంలో నగరంలో నాలుగు లక్షల కోళ్లు, 8 వేల మేకలు, గొర్రెలు జీర్ణమైపోయాయి. నగరంలో ఏ చికెన్, మటన్ సెంటర్ చూసినా కిక్కిరిసి కనిపించాయి. క్యూలైన్లలో ఉండి మరీ కొనడం కనిపించింది. సోమవారం వరకూ కిలో స్కిన్ కోడి మాంసం రూ.180, స్కిన్ లెస్ రూ.190కు అమ్మగా మంగళవారం వాటి రేటును వరుసగా రూ.210, రూ.220కి పెంచేశారు. మటన్ కిలో రూ.800 ఉండగా రూ.900కి విక్రయించారు. చేపల అమ్మకాలు కూడా జోరుగానే సాగాయి. కొన్ని చికెన్ దుకాణాల వద్ద పెద్దపెద్ద క్యూలైన్లు కనిపించాయి. జనాన్ని అదుపు చేయడం కోసం పలుచోట్ల టోకెన్ సిస్టం కూడా ప్రవేశపెట్టారు.

అంకెల్లో అమ్మకాలు

నగరంలో సగటున ప్రతిరోజు రూ.7.5 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. అయితే కనుమ ఒక్క రోజునే రూ.15 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు అంచనా. తెల్లవారుజాము నుంచే మద్యం షాపుల వద్దకు కొనుగోలుదారులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ప్రారంభంలో తక్కువ స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగినప్పటికీ మధ్యాహ్నం 11 గంటలకు తర్వాత మద్యం కోసం మందుబాబులు ఎగబడి తోసుకోవడం కనిపించింది. మరోపక్క మాంసానికీ డిమాండ్ పెరిగింది. హనుమంతువాక కూడలిలో మేకల అమ్మకాలు జోరుగా సాగాయి. సుమారు పది వేల మేకలు, గొర్రెలు అమ్ముడుపోయాయి. నగరంలోనూ, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ రెండు వేల వరకు నాటు కోళ్లు అమ్ముడైనట్లు అంచనా. ఇవి కాకుండా వెంకాబ్, బ్యాగ్ కంపెనీలకు చెందిన బ్రాంచ్‌ల నుంచి 30 వేల కిలోల చికెన్ అమ్ముడైందని అంచనా. ఒక్కో మేక సగటున 10 కిలోలు వేసుకుంటే 10 వేల మేకలు, గొర్రెలు కలిపి లక్ష కిలోల మటన్ అవుతుంది. కిలో రూ.900 చొప్పున విక్రయించడంతో రూ 9 కోట్లను ప్రజలు మటన్ కోసమే వెచ్చించారు. రెండు రోజుల క్రితం వరకు కిలో రూ.380 నుండి రూ.400 ఉన్న నాటుకోడి మాంసం కిలో రూ 700 నుంచి రూ.800కు విక్రయించారు. చికెన్ దుకాణాల్లో అమ్ముడైన 30 వేల కిలోల చికెన్‌కు సంబంధించి కిలో రూ.210 చొప్పున విక్రయించారు. దీంతో చికెన్ కోసం సుమారు రూ.60 లక్షలకు పైగానే వెచ్చించారు. ఇవి కాకుండా చాలా మంది చేపలు కొనుగోలు చేశారు.

నిర్మానుష్యంగా కనిపిస్తున్న నగరంలోని ఓ రోడ్డు

నగరం ఊరెల్లింది..!

ఉంటున్న వారిలో ఎక్కువ మంది విద్యా, ఉద్యోగ, వ్యాపార రీత్యా, ఉపాధి అవకాశాల నిమిత్తం ఉత్తరాంధ్ర జిల్లాలు, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారే. వీరంతా సంక్రాంతికి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో మంగళవారం నగరం బోసిపోయింది. నగరంలో ఉండిపోయిన కొద్దిమంది కూడా దుస్తులు కొనుగోలు కోసం దుకాణాలకు వెళ్లడం, సినిమాలకు వెళ్లి గడిపేయడంతో రోడ్లన్నీ ఖాళీగా మారిపోయాయి. కీలక కూడళ్లలోనూ ట్రాఫిక్ రద్దీ కనిపించలేదు. గత వారం రోజులుగా ప్రయాణికులతో రద్దీగా కనిపించిన ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు పలుచగా కనిపించారు. పౌర రవాణా సంస్థ (పిటిడి) బస్సులన్నీ ఖాళీగానే వెళుతుండడంతో సర్వీసులను తగ్గించేసింది. సోమవారం నగరం నుంచి 400 స్పెషల్ సర్వీసులను నడిపితే మంగళవారం నాటికి 200కి కుదించేయడం పరిస్థితికి అద్దం పడుతుంది.

బోసిపోయిన రోడ్లు

నగరవాసులంతా స్వస్థలాలకు తరలిపోవడంతో వాహనాల రద్దీ లేక జగదాంబ, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం, ఎంవిపి.కాలనీ వంటి కీలకమైన ప్రాంతాల్లోని రోడ్లు బోసిపోయాయి. ట్రాఫిక్ కూడళ్ల వద్ద రెడ్ సిగ్నల్ పడినా వాహనాలు పలుచగానే కనిపించాయి. జనాలు లేకపోవడంతో హోటళ్లలో విక్రయాలు తగ్గిపోయాయి. పెట్రోల్ బంకులు కూడా ఖాళీగానే దర్శనమిచ్చాయి. కొత్త సినిమాలు విడుదల కావడంతో నగరంలో ఉన్న వారంతా కుటుంబ సమేతంగా సినిమాలకు వెళ్లడంతో థియేటర్ల వద్ద మాత్రం హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి.

విశాఖలో మెరైన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మెరైన్ ఎగ్జిబిషన్‌లోని మత్స్య సంపదను తిలకిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

20 ఏళ్లుగా ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మెరైన్ ఎగ్జిబిషన్ ఈసారీ విశాఖ వాసులను అలరించడానికి సిద్ధమైంది. కనుమ పండగను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ఉపకులపతి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి కుమార్తె ప్రీతి చేతుల మీదుగా ఈ మెరైన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ నగరంలో ఇటువంటి అంతర్జాతీయ స్థాయి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజారెడ్డి మాట్లాడుతూ ఈసారి థీమ్‌గా మెరైన్ పార్క్‌ను ఎంచుకున్నామని, పూర్తి సెంట్రల్ ఎసి కలిగిన ఈ మెరైన్ పార్కులో 150 రకాలకు చెందిన 60 వేల చేపలను ప్రదర్శనకు ఉంచుతున్నామని ఆయన తెలిపారు. ఆ చేపలు సముద్రపు లోతుల్లో పది వేల అడుగుల కిందన మాత్రమే కనబడతాయని, వీటిని ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఇక్కడకు తీసుకొచ్చి ప్రదర్శిస్తున్నామని వెల్లడించారు.

పెంపుడు జంతువుల శిక్షకుడు సురేష్ మాట్లాడుతూ ఈ మెరైన్ ఎగ్జిబిషన్‌లో చేపలతో పాటు సుమారు 130 రకాల పక్షులతో బర్డ్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. నాలుగు రకాల మకావోలు, ఆస్ట్రిచ్‌లతోపాటు ఒక తెల్లపాము, కొండచిలువ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ఎమ్యుజ్మెంట్ పార్కును కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని, ఆదరించాలని కోరారు.

కోడి, మద్యం బాటిల్ పంపిణీ

పండగ వేళ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి నిర్వాకమిదీ..!

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సంక్రాంతి పండగను పురస్కరించుకొని నియోజకవర్గంలోని మందుబాబులకు మద్యం బాటిళ్లను, బ్రాయిలర్ కోళ్లను పంపిణీ చేయడం మంగళవారం చర్చనీయాంశమైంది. కనుమ పండుగ రోజైన మంగళవారం స్థానిక ఆశీలు మెట్ట అశోక్ నగర్‌లో ఉన్న తన కార్యాలయం వద్ద మద్యం ప్రియులకు భారీ ఎత్తున మద్యం బాటిళ్లను ఆయన పంచిపెట్టారు. ముందుగా ఎంపిక చేసిన వారికి టోకెన్లను జారీ చేసి, ఒక్కొక్కరికీ ఒక ఫుల్ బాటిల్, ఒక కోడి పంపిణీ చేశారు.

జివిఎంసి జోన్-3 కార్యాలయం వెనుక భాగంలో ఉన్న కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్ కుమార్ ఈ పంపిణీ కార్యక్రమం చేయడంతో టోకెన్లు పొందిన వారే కాకుండా టోకెన్లు లేని వారు, ఇతర నియోజకవర్గాలకు చెందిన మందుబాబులు కూడా భారీ ఎత్తున తరలివచ్చారు. వారిని అరికట్టడం కష్టంగా మారింది. ఆయన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చంద్రబాబు నిర్దోషి అని నిర్ధారణ కాలేదు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మంగళవారం సుప్రీంకోర్టులో 17ఎ వర్తింపుపై వెలువడిన తీర్పుతో చంద్రబాబుకు ఊరట లభించిందని తాను భావించడం లేదని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17ఎపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వేర్వేరు అభిప్రాయాలను వ్యక్తం చేశారని, అదే విధంగా చంద్రబాబు తరపున న్యాయవాదులు ప్రొసీజర్ ఫాలో కాలేదని, క్వాష్ చేయమని మాత్రమే కోరారని తెలిపారు. బాబు నిజాయితీపరుడని, దొంగతనం చేయలేదని ఎక్కడా న్యాయస్థానం చెప్పలేదని అన్నారు. రానున్న ప్రజాక్షేత్రంలో చంద్రబాబుకు శిక్షపడక తప్పదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి షర్మిలను అధ్యక్షురాలిగా నియమించడంపై మీడియా అడిగిన ప్రశ్నకు అమర్‌నాథ్ సమాధానమిస్తూ రాష్ట్రంలోనే లేని కాంగ్రెస్ పార్టీకి ఎవరు ప్రెసిడెంట్ అయితే మాకేంటి ? అని సమాధానమిచ్చారు. షర్మిల ప్రభావం తమ పార్టీపై ఉండబోదన్నారు.

సంక్రాంతి వేడుకల్లో జర్మన్ దేశస్తులు

నవగూడాలో సందడి

ప్రజాశక్తి - సీలేరు : తెలుగువారి మకర సంక్రాంతి, కనుమ పండగలను జర్మనీ దేశస్తులు ఎక్‌హార్డ్ గ్రాఫ్ బృంద సభ్యులు గిరిజనులతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆంధ్ర - ఒడిశా సరిహద్దు నవ గూడా గ్రామంలో గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా వారూ నర్తించారు. సరిహద్దుల్లో ప్రకృతి రమణీయమైన దృశ్యాలు తిలకించడమే కాకుండా వారి కెమెరాల్లో ఫొటోలు బంధించి మైమరిచిపోయారు. భారతదేశ గొప్పతనాన్ని మెచ్చుకున్నారు. ముందుగా సీలేరు నది నుంచి నాటు పడవలో జర్మనీ దేశస్తులు ప్రయాణం చేస్తూ నవగూడా గ్రామానికి చేరుకున్నారు. అక్కడ గిరిజనులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ పూలమాలలను జర్మనీ దేశస్తులకు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జర్మనీ దేశస్తుడు ఎక్‌హార్డ్ గ్రాఫ్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఒకటి రెండు పర్యాయాలు తమ దేశం నుంచి భారతదేశం వచ్చి వివిధ ప్రాంతాలను సందర్శించడం పరిపాటిగా మారిందన్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో దట్టమైన అడవులు, మంచు అందాలు, మన్యంలో కొలువైన ప్రకృతి అందాలను తాము తిలకిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా గిరిజన గ్రామాలను సందర్శించి వారితో మమేకమై కొంత సాయాన్ని అందిస్తామని తెలిపారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యాన.. ఆటల పోటీలు

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి పంచాయతీలోని చొక్కనపల్లి గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహం నింపాయి. సాంస్కృతిక కార్యక్రమాలు సందడి తెచ్చాయి. ఐద్వా, గిరిజన సంఘం, ప్రజానాట్యమండలిలు మహిళల్లో సామాజిక స్పృహను, చైతన్యాన్ని పెంచడం కోసం ఈ పోటీలను నిర్వహించినట్టు శ్రీరామగిరి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పులి సంతోష్ కుమార్ తెలిపారు. పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల సమాజంలో మహిళలు మరింత వెనక్కినెట్టబడుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండగ సంక్రాంతి అని, ఈ పండక్కు ఆనందంగా కుటుంబ సభ్యులతో ఉండాల్సిన అంగన్‌వాడీలను ప్రభుత్వం రోడ్డుమీద ఉంచడం సిగ్గుచేటని అన్నారు. పాలకులు చెప్పే మహిళా సాధికారత ఇదేనా ? అని ప్రశ్నించారు.

ప్రకటన

నా క్లయింటయిన అనకాపల్లి జిల్లా యస్.రాయవరం మండలం సైతారుపేట గ్రామ కాపురస్తుడు చిందాడ పెంటయ్య కుమారుడు రాజు నాకిచ్చిన భోగట్టాపై తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు యస్.రాయవరం మండలం సైదారుపేట గ్రామం నుండి కోటవురట్ల మండలం రాట్నాలపాలెం గ్రామం వచ్చుచుండగా కోటవురట్ల పోలీస్ లిమిట్స్‌లో మార్గమధ్యలో తే: 27-10-2023దిన నా క్లయింటు కుటుంబమునకు సంబంధించిన, ఈక్రింది వివరములు గల క్రియ దస్తావేజులు పోయినది. నా క్లయింటు కోటవురట్ల పోలీస్ వారికి ఫిర్యాదు కూడా చేసియున్నారు.

ఎవరికైనా సదరు దస్తావేజులు దొరికినచో నా క్లయింటుకు గాని, నాకు గాని అప్పగింత చేయవలసినదిగా ప్రార్థించుచున్నాను.

దస్తావేజు నెం : 2692/2016
సర్వేనెం : 217-2
విస్తీర్ణం : 205.41 చ॥గలు ఖాళీస్థలం

R.D.V.G.V.PRASAD
Advocate, Velama Veedhi
Narasipatnam - 531116.
Anakapalle District.
Cell : 9948470802

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

ప్రజాశక్తి-ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులుగా వైఎస్ షర్మిలను నియమించడంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి తాడి మనోహర్ తెలిపారు. ఆనందపురంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పెద్దలను, సీనియర్లను ఒకే తాటిపైకి, పార్టీని అధికారం దిశగా తీసుకొచ్చే సత్తా ఆమెకు ఉందన్నారు.

ఘనంగా అనంతుని గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం గ్రామంలో అనంతపద్మనాభ స్వామి గిరి ప్రదక్షిణ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని కనుమ రోజు ఏటా ఈ గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తారు. కొండ దిగువభాగంలో ఉన్న కుంతి మాధవ స్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేతుడైన అనంతపద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాంజనేయులు ఆధ్వర్యాన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కబడ్డీ పోటీల్లో విజేత విడుదాసులపేట

ప్రజాశక్తి -పద్మనాభం : సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని మద్ది గ్రామంలో ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో భీమిలి మండలం విడుదాసుల పేట గ్రామ జట్టు విజేతగా నిలిచింది. ఈ కబడ్డీ పోటీలకు విజయనగరం విశాఖపట్నం జిల్లాల నుంచి 40 జట్లు పాల్గొన్నాయి. మూడు రోజులుగా కొనసాగిన ఈ ఆటల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విడుదాసులపేట జట్టుకు రూ.7 వేలు, రెండో స్థానంలో నిలిచిన విజయనగరం జిల్లా జామి మండలం వెన్నుపాడు గ్రామ జట్టుకు రూ.4 వేలు, మూడో స్థానంలో నిలిచిన పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామ జట్టుకు రూ.2 వేలు నగదు బహుమతులను అందించారు.

ఊరూరా సంక్రాంతి..

ప్రజాశక్తి -తగరపువలస : సంక్రాంతి, కనుమ పండుగలు సోమ, మంగళవారాలు ఘనంగా జరుపుకున్నారు. పేద, గొప్ప అనే తేడా లేకుండా ఎవరి స్థాయిలో వారు సంప్రదాయం ప్రకారం జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముంగిటా రంగు రంగుల రంగ వల్లులు, వాటి మధ్య గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలతో సంబరంగా జరుపుకున్నారు. సంక్రాంతి, కనుమ పండుగల నేపథ్యంలో కొనుగోలుదారులతో స్థానిక వస్త్ర దుకాణాలతో పాటు ప్రైవేట్ మార్కెట్ కిట కిట లాడింది. చుట్టు పక్కల గ్రామాలకు ఇదొక్కటే ప్రధాన మార్కెట్ కావడంతో జంక్షన్‌లో రద్దీ పెరిగింది. సాధారణ సమయంలోనే ఇక్కడి జంక్షన్ జనంతో రద్దీగా ఉంటుంది ప్రస్తుతం పెద్ద పండగ కారణంగా వివిధ రకాల వస్తు సామగ్రి కొనేందుకు వచ్చే వారితో మార్కెట్‌లో రద్దీ ఏర్పడింది. గొర్రెలు, మేకలు, కోళ్ల అమ్మేందుకు, వాటిని కొనేందుకు వచ్చిన వారితో ప్రైవేట్ మార్కెట్‌లో రద్దీ పెరిగింది. రోడ్డు పక్కన బట్టల వ్యాపారం కూడా జోరందుకుంది. పెద్దలకు మూలన పెట్టేందుకు అవసరమైన కొత్త బట్టల అమ్మకాలు రోడ్డు పక్కన సాగాయి. తక్కువ ధరకు వస్తాయన్న కారణంగా, పేదలు ఎక్కువ శాతం రోడ్డు పక్కన అమ్మే బట్టలనే కొనేందుకు ఆసక్తి చూపారు.

కిటకిటలాడిన మార్కెట్

రద్దీగా ఉన్న తగరపువలస జంక్షన్

చిన్నారులకు సంస్కృతిని తెలియజేయాలి

చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : భారతీయ సంస్కృతిని చిన్నారులకు తెలియజేయాల్సిన బాధ్యత పెద్దలు, ఉపాధ్యాయులపై ఉందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు (గణబాబు) అన్నారు. సింహాచలంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శివకుమార్, విమల దంపతుల ఆధ్వర్యాన గోదాదేవి కల్యాణం, గోదాదేవి వేషధారణ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ, సంగీతం, సాహిత్యం, నాట్యం, గానం తదితర లలిత కళలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ నృత్య భారతి ఆధ్వర్యాన గోదాదేవి నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. నృత్య కళాకారిణి శిరీషను అంతా అభినందించారు. సాయి సూర్య మ్యూజిక్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యాన 20 మంది చిన్నారులు పాటలను ఆలపించారు. సంగీత ఉపాధ్యాయులు లక్ష్మీస్వాతిని సన్మానించారు. లలిత సంగీత శిక్షణాలయానికి చెందిన ఉగ్గిన రోజారాణి బృందంచే వీణ కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ఐఎంయు ప్రతినిధులు బివి.రామలింగేశ్వరరావు, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దయాల్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి -గాజువాక : మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తండ్రి దయాల్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించారు. దయాల్‌రెడ్డి విగ్రహానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దయాల్‌రెడ్డి వెంకన్నపాలెం తొలి సర్పంచ్‌గా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు పీవీ సురేష్, తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, ఇమ్రాన్, ఎం.పరదేశి, గంట్యాడ గురుమూర్తి, జి.సత్యారావు, జి.మహేశ్వర్‌రెడ్డి, ప్రగడ వేణుబాబు, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామోదార్, బోండా గోవిందరాజులు పాల్గొన్నారు.

దుస్తులు, దుప్పట్లు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న చందు, వెంకటేష్ గౌడ్

ప్రజాశక్తి-యంత్రాంగం

సంక్రాంతి పండగ నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం పేదలకు పలువురు దస్తులు, దుప్పట్లు పంపిణీచేశారు.

గాజువాక : సర్దార్ గౌతు లచ్చన్న గీత కులాల ఉత్తరాంధ్ర యువజన సంఘం అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉడా కాలనీలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఉరుకూటి రామచంద్రయాదవ్, కేత రాజు, నెల్లి సాధూరావు, న్యాయవాది పోలవరపు రమణబాబు, ఏకుల సూర్యప్రకాష్, గెద్దాడ రమేష్, కడవాల నాయుడు, దాసరి గోవిందరాజు, కూర్మ లక్ష్మి, శాంతిరెడ్డి పాల్గొన్నారు.

మునగపాక: మునగపాక గ్రామానికి చెందిన వేగి నూకన్న, సీతయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వేగి పరదేశి నాయుడు, లక్ష్మణరావు, వెంకటరమణమూర్తి, కీర్తిశేషులు అప్పారావు కుమారుడు బోస్ ఆధ్వర్యాన సంక్రాంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి, అనుబంధ సంఘాల నాయకులు దాడి ముసలి నాయుడు, పెంటకోట విజయ్, దాడి శివ, పెంటకోట శ్రీరామ్ మూర్తి, కోరుకొండ ప్రసాద్, బొడ్డేడ ప్రసాద్, అప్పలనాయడు, సత్యనారాయణ, దాడి అప్పలనాయుడు, భాగ్యరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సంక్రాంతి సందర్భంగా ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ మంగళవారం 1100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలస గ్రామ పంచాయతీలోని 18 మంది పారిశుధ్య కార్మికులకు భీమిలి ఎఎంసి మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు దుస్తులు పంపిణీ చేశారు. దుస్తులు అందించడంతో పారిశుధ్య కార్మికులు ఆనందం వ్యక్తంచేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న కోరాడ నాగభూషణరావు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని చంద్రయ్యపేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారితే సంక్రాంతి పండుగ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చే పలు ప్రారంభోత్సవాలు చేయడానికి స్థానిక సర్పంచ్ సబ్బవరపు పార్వతి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం భారీ ఫ్లెక్స్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఫ్లెక్సీ బోర్డు కొంచెం పక్కకు వంగడంతో గ్రామానికి చెందిన భోకం సురేష్ (32) గవిరెడ్డి ఎర్రి నాయుడు (33) ఇద్దరు దాన్ని సరి చేసే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. బోర్డు పైనున్న విద్యుత్ వైర్లు ఫ్లెక్స్ బోర్డుకు తగలడంతో విద్యుత్ షాక్‌తో ఇద్దరు క్రింద పడిపోయారు. గ్రామస్తులు విశాఖపట్నం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాలను అనకాపల్లి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించామని ఎస్సై ధనుంజయ తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

పలువురు అరెస్ట్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక హైవే వైన్‌షాప్ సమీపంలో ఖాళీ ప్రదేశంలో పేకాట శిబిరంపై భీమిలి పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతుండగా నలుగురు పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి రూ.14,100, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ డి.రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.

భీమిలిలో 17 మంది అరెస్టు

భీమునిపట్నం : స్థానిక బ్యాంక్ కాలనీలోని ఖాళీ ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో 17 మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.91,650, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ డి.రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.

చోరీ బంగారం స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం విస్సన్నపేట గ్రామంలో ఆదివారం రాత్రి చెక్క రమేష్ ఇంట్లో చోరీ జరిగిన పద్నాలుగున్నర తులాల బంగారం (7 వస్తువులు)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భోగి పండుగ రోజు రాత్రి 12.30 సమయంలో చెక్క రమేష్ ఇంట్లో లేక పోవడంతో పక్కన ఇంటిలో ఉన్న ముగ్గురు ఆయన ఇంటిలోకి చొరబడి బంగారు వస్తువులను దొంగలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సోమవారం కశింకోట సిఐ వినోద్‌బాబు పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వచ్చి చోరీ ప్రాంతంలో వేలు ముద్రలు సేకరించారు. షేక్ ముజెబ్, దామరౌతు నవీన్ కుమార్, మరో మైనర్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వీరు మద్యం, దుబారా ఖర్చులకు అలవాటు పడి చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. షేక్ ముజబ్, నవీన్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు. మైనర్‌ను ఆదుపులోకి తీసుకున్నారు. కేసును సిఐ వినోద్‌బాబు దర్యాప్తు చేశారు.

బొత్స ఝాన్సీకి ముత్తంశెట్టి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీని విశాఖ పార్లమెంట్ వైసిపి అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉమ్మడి విశాఖ జిల్లా వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివనందీష్ మంగళవారం విజయనగరంలోని వారి నివాసంలో కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి బొత్స సత్యనారాయణను కూడా కలిసి అభినందనలు తెలిపారు.

బొత్స ఝాన్సీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ముత్తంశెట్టి

నడవని బతుకు బండి!

- దినదినగండం.. పండ్ల వ్యాపారుల జీవనం
- రోజంతా వ్యాపారం చేసినా కుటుంబ పోషణ కష్టమే
- గత్యంతరం లేక రోడ్డుకిరువైపులా వ్యాపారం
- ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి -తగరపువలస : ఏళ్ల తరబడి రోడ్డు కిరువైపులా ఎండనకా, వాననకా పండ్ల వ్యాపారం చేస్తున్నప్పటికీ తమ జీవితాల్లో ఎదుగూ, బొదుగూ లేకుండా ఉందని పండ్ల వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు సీజనల్‌వారీగా పండిన తాజాపండ్లను తీసుకొచ్చి అమ్మడం ద్వారా అందరికీ ఆరోగ్యం, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నప్పటికీ, తాముమాత్రం అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

తగరపువలసలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా తోపుడు బళ్లపైనే గాకుండా రోడ్డుపక్కన తట్టబుట్టల్లో దానిమ్మ, నిమ్మ, యాపిల్, కమలాలు, ద్రాక్ష, రేగు తదితర పండ్లు అమ్ముకుంటూ అనేకమంది బతుకు బండి నడుపుకుంటున్నారు. ఉదయం ఆరుగంటలకే రోడ్డుపైనే దుకాణాలతో ప్రత్యక్షమైన వీరు, రాత్రి 9 గంటల వరకు ఎండవానల్లో రోడ్డుపైనే పడిగాపులు పడుతూ, పండ్ల విక్రయాలు జరుపుతుంటారు. వారంలో రెండు, మూడు సార్లు విశాఖ, విజయ గరంలోని హోల్ సేల్ మార్కెట్లకు వెళ్లి ఏకమొత్తంగాపండ్లు కొనుగోలు చేసి తెచ్చి, వాటిని భద్రపరిచి, ఇక్కడ అమ్ముతుంటారు. రోజంతా ఇలా రోడ్డుపైనే నిలబడి, కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తూ పండ్ల వ్యాపారం చేస్తున్నా తమకు గిట్టేది అంతంత మాత్రమేనని, కుటుంబపోషణకు సరిపడా ఆదాయం కూడా సమకూరని పరిస్థితుల్లో గత్యంతరం లేని పరిస్థితుల్లో గానుగెద్దుల్లా జీవనం సాగిస్తున్నామని అంటున్నారు ఒక్కోసారి చెక్క పెట్టెల్లో వచ్చే పండ్లలో పాడైనవి ఉంటాయని, దీంతో నష్టం చవి చూడాల్సివస్తుందని స్థానిక వ్యాపారులు అంటున్నారు. అదీగాక ప్రతిరోజూ వ్యాపారం ఒకేలా ఉండదని, తెచ్చిన పండ్లన్నీ అమ్ముడైతే సరేసరి, లేకుంటే మరుసటి రోజుకు అవి వాడిపోయే పరిస్థితి ఉండడంతో కొన్ని ధరకంటే తక్కువకు అమ్మి సొమ్ము చేసుకోవాల్సి వస్తుందని అంటున్నారు.

180 యాపిల్ పండ్లున్న చెక్క బాక్స్ ఖరీదు సుమారు రూ 3 వేల పైన ధర ఉంటుందని, ముగ్గురు, నలుగురు కలిసి విజయనగరం, విశాఖ వెళ్లి ఆటోల్లో వివిధ రకాల పండ్లను తెస్తుంటామని పలువురు వ్యాపారులు తెలిపారు. తెచ్చుకున్న సరుకు 3,4 రోజులకు మించి నిల్వ ఉంటే పాడైపోతుందని వారు చెబుతున్నారు. 100 కమలాలు ఉన్న పెట్టె రూ 900లు, 50 కిలోల (బస్తా) నిమ్మకాయలు రూ1 800లు, 8కిలోల కిస్మిస్, ద్రాక్ష రూ 600 లకు కొనుగోలు చేసి, వాటికి రవాణా ఖర్చులతోపాటు, తాము వెళ్లి తెచ్చేందుకు అయ్యే బస్, ఆటో ఛార్జీలు అన్నీ కలుపుకుంటే భారీ ధర ఉంటుందని, కొనుగోలుదారులకు అమ్మేసరికి ఈ ఖర్చులన్నీ పోనూ ఎంతోకొంత లాభం వేసుకుని అమ్ముతుంటామని పలువురు పండ్ల వ్యాపారులు తెలిపారు. రోడ్డుపైకి తెచ్చే తోపుడు బండికి అద్దె, రోడ్డుపై దుకాణాలు వేసినందుకు ఆశీలు, ఇంకా ఇతరత్రా మామూళ్లు ఇవన్నీ పోను మిగిలిన అరకొర ఆదాయంతో దుర్భరంగా జీవితాన్ని నెట్టుకువస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. తమలో మెజార్టీ చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల దుకాణదారులకు పెట్టుబడి లేని పరిస్థితుల్లో రోజు వారీ అప్పులు ఇచ్చే వారి వద్ద రుణం తీసు కుని వ్యాపా రం చేస్తున్నామని, వచ్చిన ఆదాయం లోనే వారి అప్పును వాయి దాల పద్ధతిలో వడ్డీతో తీర్చగా మిగిలిన రాబడితో కుటుంబ కనీస అవసరాలే తీరని పరిస్థితి ఉందంటూ వాపోతున్నారు.

ఆదాయం అంతంత మాత్రమే...

రోజంతా బండి వద్ద నిల్చుని వ్యాపారం సాగిస్తే వచ్చే ఆదాయం అంతంత మాత్రమేనని వ్యాపారులు ఇంటి రాంబాబు, నర్సమ్మ, రమేష్, వరలక్ష్మి తదితర రోడ్డు పక్క వ్యాపారులు వాపోయారు. ప్రభుత్వపరంగా తమ వ్యాపారాలకు తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలను ఇవ్వడంతోపాటు తమ వ్యాపారాలకు అన్ని విధాలా ప్రభుత్వపరంగా సహకారం అందించాలని వీరు వేడుకుంటున్నారు.

కష్టంగా కుటుంబ పోషణ..

అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పండ్ల వ్యాపారం చేస్తున్నప్పటికీ తమ కుటుంబ పోషణ కష్టంగా మారిందని పలువురు పండ్ల వ్యాపారులు తెలిపారు పప్పు, ఉప్పు, కూరగాయలు, ఇలా నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రోజు వారీ అవసరాలకు తగ్గట్టు ఆదాయం లేదు. దీంతో బతుకు భారంగా ఉంది. కార్తీకమాసం, వేసవి లోనే తమ వ్యాపారం కొంత మెరుగ్గా ఉంటుందని, మిగిలిన కాలంలో వ్యాపారం మందకొడిగా సాగుతుందని అన్నారు

తగరపువలసలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తున్న మహిళ

రోడ్డు పక్కనే తట్టబుట్టలతో పండ్లు, కూరగాయలు అమ్ముకుంటున్న మహిళలు

రుణాలు ఇప్పించండి

పండ్ల వ్యాపారం కోసం వేల రూపాయల్లో పెట్టుబడి అవసరం. బ్యాంకుల ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రుణాలు ఇప్పించాలి. తమ ఓట్లతో అధికారంలోకి వచ్చినా, ఏ ప్రభుత్వమూ తమకు రుణాలు ఇప్పించి ఆదుకోలేదు. కష్టసుఖాలను పట్టించుకోవడం లేదు.

ఐ చిట్టిలక్ష్మి , పండ్ల వ్యాపారి

ఒక్కోసారి చాలా ఇబ్బందులు

రోడ్డుకు ఇరువైపులా తోపుడుబళ్లపై వ్యాపారం చేస్తున్న సమయంలో ఒక్కోసారి ట్రాఫిక్ సమస్య ఉందంటూ పోలీసులు చెప్పే టప్పుడు, చాలా ఇబ్బందులు పడుతున్నాం. వివిఐపిలు వచ్చినా, ఏవైనా కార్యక్రమాలు నిర్వహించినా, ముందు మేమే బలవుతున్నాం.

బి రమేష్, పండ్ల వ్యాపారి

ఎట్టకేలకు షాదీఖానా పునర్నిర్మాణం

- రూ.48 లక్షలతో ఆధునికీకరణతో ముస్లిముల హర్షం
- అదనంగా వివాహవేదిక, వంటగది, టాయిలెట్లు నిర్మాణం
- రద్దు చేసిన ఉర్దూ పాఠశాలను పున:ప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బంగ్లా మెట్టలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ముస్లిముల షాదీఖానా శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో, దాని ఆధునికీకరణకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. జివిఎంసి. నిధులు రూ 48 లక్షలు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు .పేద ముస్లిం కుటుంబాలు వివాహాలు జరుపుకునేందుకు వీలుగా వరుడు, వధువులకు ప్రత్యేక గదులు, ఉన్న విస్తీర్ణం పెంచి వివాహ వేదిక, టాయిలెట్లు, వంట గది నిర్మాణంతో పాటు ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దెబ్బతిన్న కిటికీలు, తలుపులు స్థానంలో కొత్తవి అమర్చనున్నారు. దీంతో పేద ముస్లిం కుటుంబాల కు వివాహాలు, ఇతర శుభకార్యాలు జరుపుకునేందుకు ఇక ఇబ్బందులు తొలగినట్టే.

స్థానిక ముస్లిముల విజ్ఞప్తి 2002లో రూ.7లక్షలతో దీన్ని నిర్మించారు. ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి భారీ, మధ్య తరహా నీటి పారుదల శాఖ మంత్రి కడియం శ్రీహరి ఈ భవనాన్ని 2002 అక్టోబర్ 28న ప్రారంభించారు అయితే అప్పట్లో షాదీఖానాలో కనీస సౌకర్యాలను కల్పించలేదు. తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, వివాహ వేదిక వంటి సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఈ భవనంలో ఎటువంటి వివాహాలు, ఇతర వేడుకలను నిర్వహించేందుకు అవకాశం లేని పరిస్థితి ఉంది. దీంతో దీని వినియోగానికి స్థానిక ముస్లిములు అంతగా ఆసక్తి చూపని పరిస్థితుల్లో కాలక్రమేణా ఈ భవనం వినియోగానికి దూరమై, అనివార్యంగా నిరుపయోగంగా మారింది.

కనీస సౌకర్యాలు లేక వినియోగానికి దూరం

గతంలో నిర్మించిన షాదీఖానా భవన నిర్మాణంలో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవు. షాదీఖానాకు భవనాన్ని మాత్రమే నిర్మించి, అందులో కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో పేద, మధ్య తరగతి ముస్లిం కుటుంబాలు దీనిలో వివాహాలు జరుపుకునేందుకు పెద్దగా ఆసక్తి కనబరచ లేదు. కొన్నాళ్ల పాటు పేద ముస్లిం కుటుంబాలు గత్యంతరం లేని పరిస్థితుల్లో నానా అవస్థలు పడి పెళ్లి వేడుకలు జరుపుకున్నప్పటికీ , అటు తర్వాత వేడుకలు జరుపుకునేందుకు ముఖం చాటేశారు. షాదీఖానా భవనం నిర్మించేటప్పుడే మౌలిక సదుపాయాలు కల్పించి ఉంటే ఈ భవనం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేదని, తద్వారా ఇలా శిథిలావస్థకు చేరేది కాదని పలువురు ముస్లిం కుటుంబాలు తెలిపాయి.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో ...

స్థానికఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో శిథిలావస్థకు చేరుకున్న షాదీఖానా ఆధునికీకరణ, పునర్నిర్మాణం పనులకు నిధులు మంజూరు కావడం, పనులు చేపట్టడంపై పలు పేద ముస్లిం కుటుంబాలు హర్షం వ్యక్తం జేస్తున్నాయి. కనీస సౌకర్యాలతో దీన్ని నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చినా ఇక్కడ ముస్లిం కుటుంబాల సామాజిక అవసరాలు, వివాహ వేడుకలు, ఇతర శుభకార్యాలకు ఆసరాగా ఉంటుందని అంటున్నారు.

ఉర్దూ పాఠశాలను పున:ప్రారంభించాలి

ముస్లిములు నివసించే ఈ ప్రాంతంలో ఒకప్పుడు ఉండే ఉర్దూ పాఠశాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.కొన్నేళ్ల కిందట ఇదే ప్రాంతంలో జివిఎంసిప్రాథమిక పాఠశాలకు కొద్ది దూరంలో ఏర్పాటు చేసిన ఉర్దూ పాఠశాలను అర్ధాంతరంగా మూసేశారు. దీంతో ఇక్కడ ముస్లిం పిల్లలు తమ మాతృభాష ఉర్దూలో విద్యాభ్యాసానికి అవకాశం లేకుండా పోయింది. ముస్లిం పిల్లల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, రద్దుచేసిన ఉర్దూ పాఠశాలను పున్ణప్రారంభి స్తే ఉపయోగంగా ఉంటుందని

చురుగ్గా పునర్నిర్మాణ పనులు జరుగుతున్న షాదీఖానా

ప్రైవేటుకు తరలిపోతున్న చెరుకు

- తుమ్మపాల సుగర్స్ మూత

- బకాయిలు చెల్లించని గోవాడ కర్మాగారం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం కేంద్రంగా ప్రతిరోజు వందలాది టన్నుల చెరకు ఇతర ప్రాంతాలకు తరలిపోతుంది. మండలంలో వరి పంటతో పాటు వాణిజ్య పంట అయినా చెరకును రైతులు అధికంగా పండిస్తున్నారు. ఈ చెరుకును గోవాడ చక్కెర కర్మాగారానికి అధికంగా సరఫరా చేస్తూ ఉంటారు. అయితే ఎర్రవాయి ప్రాంత గ్రామాలైన రాజాం, నీలకంఠాపురం, తైపురం, చిట్టయ్యపాలెం, తురకలపూడి, మల్లం, ఆర్.శివరాంపురం, ఆర్.భీమవరం తదితర గ్రామాల రైతులు తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీకి రాజాం చెరుకు కాటా ద్వారా చెరుకును సరఫరా చేస్తూ ఉండేవారు. బుచ్చయ్యపేట, కందిపూడి, దిబ్బిడి, పోలేపల్లి, పి.భీమవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు గోవాడ చక్కెర కర్మాగారానికి చెరుకును సరఫరా చేసేశారు. గతంలోనే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ మూతపడటంతో ఎర్రవాయి ప్రాంత రైతులు పండించిన చెరుకును ప్రైవేటు ఫ్యాక్టరీలకు తరలించడం మొదలుపెట్టారు. రాజాం కేంద్రంగా ప్రైవేటు కాటాల వద్ద ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీల ద్వారా టెక్కలి, పాలకొండ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా అవుతోంది. ఒక్కొక్కటి టన్నుకు రూ.2,400 చొప్పున చెల్లిస్తుండడంతో రైతులు ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారు. మరో వైపు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు సరఫరా చేసిన చెరుకుకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో పలువురు గోవాడ ఫ్యాక్టరీ సభ్య రైతులు సైతం ప్రైవేటు ఫ్యాక్టరీకి సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొంది.

పాలాభిషేకాల చేశారు.. పేమెంట్లు మరిచారు

గోవాడ చక్కర కర్మాగారానికి గత ఏడాది చెరకు సరఫరా చేసిన రైతులకు టన్ను ఒక్కంటికి రూ.2821.25 చొప్పున చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం రైతులకు రూ.2500 చెల్లించారు. మిగతా రూ.321 చెల్లించాల్సి ఉంది. గత ఏడాది సరఫరా చేసిన చెరకు ఈ ప్రోత్సాహకం నేటి వరకు చెల్లించలేదు. ఏడాది దాటిపోయింది. ప్రస్తుత ఫ్యాక్టరీ సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటింది. గత సంవత్సర చెరకు బకాయిలు ప్రభుత్వం విడుదల చేసిందంటూ అధికార పార్టీకి చెందిన నాయకులు పలుమార్లు హడావిడి చేసి ముఖ్యమంత్రి చిత్రపటానికి ఐదు ఆరుసార్లు పాలాభిషేకాలు చేశారు. పాలాభిషేకాలైతే చేశారు గాని పేమెంట్లు మాత్రం రైతులు ఖాతాలో జమ కాలేదని రైతులు వాపోతున్నారు.

రాజాం వద్ద ట్రాక్టర్లతో సిద్ధంగా ఉంచిన చెరుకు

భరత్ కుమార్ ఢీకొట్టేనా?

ప్రజాశక్తి-అనకాపల్లి

మలసాల భరత్ అంటే నిన్న మొన్నటి వరకు ఎవరికీ అంతగా పరిచయం లేని వ్యక్తి. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే అయినా ఆయన ఇంతవరకు రాజకీయాలకు దూరంగానే ఉన్నారు. తన వ్యాపారాలకే పరిమితమై ఉన్న వ్యక్తి. అయితే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి భరత్ వెళ్లడంతో మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యాన ఆ పార్టీలో చేరారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా పార్టీ బాధ్యతలు అప్పగించింది. అనకాపల్లి సీటు కూడా ఆయనకే దాదాపు ఖరారు అయినట్టు భావిస్తున్నారు. ఎన్నికలకు కేవలం కొన్ని నెలలు మాత్రమే ఉండడంతో సమన్వయకర్తగా భరత్ కష్టపడాల్సి ఉంది. ఇది కొంతవరకు కత్తి మీద సామే అయినా కష్టం మాత్రం కాదని కొందరి వాదన.

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అనుచరులుగా పని చేసిన భరత్ తండ్రి మలసాల రమణరావు దశాబ్దాలుగా విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతూ ఉండగా, తల్లి ధనమ్మ కసింకోట ఎంపీపీగా, జెడ్పిటిసి సభ్యురాలిగా పనిచేసిన అనుభవం ఉంది. భరత్ మామ గంగుపాం నాగేశ్వరరావు అనకాపల్లి డిసిఎంఎస్ చైర్మన్‌గా, శ్రీసత్యనారాయణ దేవస్థానం చైర్మన్‌గా పనిచేయగా, అత్త జలజ అనకాపల్లి ఎంపీపీగా పని చేశారు. ఇది భరత్‌కుమార్‌కు బలమైన అంశం.

అయితే 2019 ఎన్నికల్లో మంత్రి గుడివాడ అమర్నాథ్ దాడి వీరభద్రరావు కుటుంబంతో పాటు అన్ని వర్గాలను కూడగట్టుకుని విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలు వేరువేరుగా పోటీ చేసిన నేపథ్యంలో 6000 పైచిలుకు ఓట్లతో అమర్నాథ్ గెలిచారు. జనసేన పార్టీ అభ్యర్థికి ఆ ఎన్నికల్లో 11 వేల ఓట్లు పైబడి రావడం గమనార్హం. ప్రస్తుతం ఆ రెండు పార్టీలు ఏకమై ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నాయి. మరోవైపు దాడి వీరభద్రరావు కుటుంబం తెలుగుదేశం పార్టీలో చేరిపోయింది. ఈ నేపథ్యంలో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థిని ఎదుర్కోవాలంటే బలమైన ఎన్నికల వ్యూహరచన చేయాల్సి ఉంది. గతంలో తన కుటుంబం, తన అత్తగారి కుటుంబం టిడిపిలో పనిచేసిన అనుభవం, అప్పటి పరిచయాలు ఏ మేరకు పనిచేస్తాయో చూడాలి. ఏదేమైనా యువకుడు, విద్యావంతుడు, వ్యాపారవేత్త, ఆర్థిక బలం ఉన్న మలసాల భరత్ రానున్న ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలను ఢీ కొట్టి విజయం సాధించి గెలుపు గుర్రాన్ని చేజిక్కించుకోగలడా అనేది వేచిచూడాలి!

నడిపించే నాయకుడు కరువు

అయోమయంలో టిడిపి కేడర్

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు మండలంలో తెలుగుదేశం పార్టీకి నాయకత్వ లోపం కనపడుతుంది. ఈ మండలంలో తెలుగుదేశం పార్టీని సరైన మార్గంలో నడిపించే నాయకులు లేరు. కె.కోటపాడు మండలం తొలి నుండీ తెలుగుదేశం పార్టీకి కంచుకోట కాగా, నేడు నాయకత్వ కుమ్ములాటల వల్ల కంచుకోటకు బీటలు వారే ప్రమాదం ఉందని ఆ పార్టీ కేడర్ ఆందోళన చెందుతోంది.

మాడుగుల నియోజకవర్గ స్థాయిలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్చార్జి పివిజి.కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాద్‌రావు మూడు గ్రూపులుగా ఏర్పడి కుమ్ములాడుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో పివిజి.కుమార్, పైలా కలిసి కార్యక్రమాలు చేస్తున్నా, రామానాయుడు మాత్రం ప్రత్యేక గ్రూపుగానే వ్యవహరిస్తున్నారు. కె.కోటపాడు మండలంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా సబ్బవరపు రామునాయుడు ఎక్కువ కాలం పని చేశారు. అయితే గవిరెడ్డి రామానాయుడుతో సబ్బవరపుకు విభేదాలు రావడంతో పార్టీ మండల బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించి, కొరుపోలు జైరామ్‌ను నియమించారు. తరువాత రొంగళి మహేష్‌కు పార్టీ మండల బాధ్యతలు అప్పగించారు. మహేష్ పార్టీ బాధ్యతలు చేపట్టిన కొంతకాలం వరకు గవిరెడ్డి రామానాయుడు వెంట నడిచి, మధ్యలో ఆయనను విడిచి పైలా ప్రసాదరావు వెంట వెళ్లారు. మహేష్ తన స్వలాభం కోసం పైలా వెంట వెళ్లారని మండలంలో విమర్శలు రాగా వీటిపై ఇటీవల గొండుపాలెంలో జరిగిన తెలుగుదేశం పార్టీ నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మహేష్ దానికి వివరణ ఇచ్చుకున్నారు. తాను గవిరెడ్డి రామానాయుడును వదిలి పైలా ప్రసాదరావు వెంట వెళ్లినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని చెప్పుకొచ్చారు.

నియోజకవర్గం ఇన్‌ఛార్జిని పట్టించుకోని మండల అధ్యక్షుడు

పార్టీ అధిష్టానం నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతల నుండి గవిరెడ్డి రామానాయుడును తప్పించి పివిజి.కుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. అయితే కుమార్‌ను టిడిపి మండల అధ్యక్షులు మహేష్ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. టిడిపి క్రమశిక్షణకు మారుపేరని, అటువంటిది పార్టీ అధిష్టానం నిర్ణయించిన పివిజి.కుమార్‌ను కాదని పైలా వెంట వెళ్లడం మంచిది కాదని నాయకులు, కార్యకర్తలు మహేష్‌ను అడగగా, పివిజి.కుమార్ తనను పట్టించుకోలేదని బదులిచ్చారు. మండలంలో సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు పివిజి.కుమార్ ముందుగా తనకు తెలియజేయడం లేదని, తనకు సముచిత స్థానం కల్పించకపోవడంతోనే తాను పైలా వెంట వెళ్ళవలసి వచ్చిందని మహేష్ చెబుతున్నారు. పివిజి.కుమార్ మాత్రం మండలానికి వచ్చిన ప్రతిసారీ ముందుగానే మహేష్‌కు తెలియజేసున్నానని, ఆయన మాత్రం తన నాయకత్వాన్ని పట్టించుకోలేదని వాపోతున్నారు.

రాష్ట్రంలో వైసిపి పట్ల వ్యతిరేకత రోజు రోజుకి పెరుగుతోంది. మండలంలో వైసిపి వైఫల్యాలను ఆ పార్టీపై ఉన్న వ్యతిరేకతను ప్రజలకు తెలియజేసి, టిడిపిని బలోపేతం చేయాల్సిన నాయకులు ఆ పనిని విస్మరించి కుమ్ములాడుకోవడంపై పార్టీ కేడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. మండలంలో కేడర్‌ను ఒక తాటిపైకి తీసుకు రావలసిన మహేష్ అధిష్టానం నియమించిన ఇన్చార్జిని పట్టించుకోకపోవడంతో టిడిపి కార్యకర్తలు అయోమయానానికి గురవుతున్నారు. సమర్థత ఉన్న నాయకుడు మండల పార్టీ అధ్యక్షులుగా ఉంటేనే తప్ప మండలంలో ఉన్న టిడిపి శ్రేణులను ఒక తాటిపైకి తీసుకురావడం కష్టంగా ఉంటుంది. ఇదే విధంగా టిడిపి నాయకత్వం వ్యవహరిస్తే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మళ్లీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో బిసి వసతి గృహం

- పెచ్చులూడుతున్న స్లాబ్

- వర్షం పడితే కారిపోతున్న వైనం

- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండల కేంద్రంలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. వర్షం వస్తే కారిపోతుంది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఈ హాస్టల్ భవనాన్ని 1982 సంవత్సరంలో నిర్మించారు. ఇందులో నాలుగు గదులు విద్యార్థుల వసతికి, ఒకటి స్టోర్ రూమ్, మరొకటి ఆఫీస్ రూమ్‌గా ఉపయోగిస్తున్నారు. ఈ భవనం నిర్మించి 40 సంవత్సరాలు గడవడంతోపాటు గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం ఒక్కసారిగా శిథిలావస్థకు చేరుకుంది. స్టోర్ రూమ్ మినహా విద్యార్థులు ఉంటున్న నాలుగు గదులు, వసతిగృహం సంక్షేమ అధికారి ఆఫీసు రూము మొక్క స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. స్లాబ్ ఫ్లోరింగు పోవడంతో వర్షం పడితే అందులో నీరు చేరి స్లాబ్‌లో లీక్ అవుతుంది. వర్షాలు పడినప్పుడు గదులు కారిపోతుండడంతో విద్యార్థులు ఆ తడిలోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మరో వైపు స్లాబ్ పెచ్చులూడడంతో ఎప్పుడు తమ మీద పడతాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. దీంతో పాటుగా ఆ వసతి గృహ సంక్షేమ అధికారి ఉంటున్న రూమ్ కూడా కారిపోవడంతో రికార్డులు తడిచిపోతున్నాయి.

కె.కోటపాడు బిసి బాలుర వసతి గృహం

వెనుకబడిన తరగతుల సంక్షేమ వసగృహాలు మండలంలో కొరువాడ, కె.కోటపాడులో ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో భవనాల సదుపాయం అంతంత మాత్రమే ఉన్నందున ఇందులో చేరడానికి విద్యార్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు. గతంలో ఈ వసతి గృహాల్లో విద్యార్థులు 100పై బడే ఉండేవారు. కానీ ఇప్పుడు 100 లోబడే ఉంటున్నారు. ఈ వసతి గృహాల్లో సిబ్బంది కూడా ఉండవలసిన వారి కన్నా తక్కువగా ఉంటున్నారు. వారు కూడా కాంట్రాక్టు కార్మికులే. కె.కోటపాడు వసతి గృహంలో (కుక్కు) వంట మనిషి కూడా లేరు. ఉన్న అరకొర సిబ్బందితో వంట చేయిస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారు. గతంలో వసతి గృహాలను సుందరంగా తయారు చేసి విద్యార్థులను ఆకట్టుకుని విధంగా ఉండేవి. ఇప్పుడు మాసిపోయి, శిథిలావస్థకు చేరడంతో వాటిల్లో విద్యార్థులు చేరడానికి అంతగా ఆసక్తి చూపడంలేదు. ఈ వసతి గృహాల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరాలంటే ఉన్న భవనాలకు మరమ్మతులు చేసి అన్ని అంగులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

బుద్ధుని మార్గం అనుసరణీయం : ఎంపీ

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రపంచానికి బుద్ధుని మార్గం అనుసరణీయమని అనకాపల్లి ఎంపీ బివి.సత్యవతి పేర్కొన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య, అంబేద్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యాన బౌద్ధమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పురావస్తు శాఖ ఆధీనంలోని బౌద్ధ పుణ్యక్షేత్రంలో ఒకటైన బొజ్జన్న కొండకు రూ.7.3 కోట్లతో పూర్తిస్థాయి వసతులతో ధ్యాన మందిరం, ఈ ప్రాంత బౌద్ధ ఆనవాళ్ల సంస్కృతి, సంప్రదాయాలు, మ్యూజిక్ సిస్టమ్‌తో కూడిన లేజర్ షో డాక్యుమెంటరీ రూపంలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా ప్రదర్శన జరిగేందుకు కావలసిన విధంగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కనుమ రోజు నిర్వహించే తీర్థ మహోత్సవానికి వివిధ జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన పర్యాటకులకు అన్ని వసతులతో కూడిన విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తి శాంతి మార్గంలో వెళ్లాలంటే బుద్ధుని పంచశీల సూత్రాలు నేటి యువతకు ఆదర్శమన్నారు. అనంతరం కొండపై డాక్టర్ జ్ఞానదీప్ మహాథెరో ఆధ్వర్యంలో పంచశీల శాంతియాత్రను ప్రధాన స్థూపం వరకు చేపట్టారు.

బౌద్ధమేళాలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

సభ నిర్వాహకులు డాక్టర్ మాటూరు శ్రీనివాసరావు, బోరా వేణుగోపాల్ గౌతమ్ మాట్లాడుతూ, జీవిత లక్ష్యం చేరుకునేందుకు బుద్ధుని మార్గం ఒక్కటే సరైనదని, అందరూ పంచశీల సూత్రాలను ఆచరించాలని కోరారు. బౌద్ధమతంలో అష్టాంగ మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఉంద్రాజవరం బౌద్ధ ధర్మ పీఠం వ్యవస్థాపకులు బంతే అనాలియో పేర్కొన్నారు. అనంతరం కొండ ప్రవేశ ద్వారం వద్ద విశాఖ బౌద్ధ సంఘాలు, సిద్దార్థ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా మహాబోధి సొసైటీ ఆధ్వర్యాన మహా సభ నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డు కళ్యాణరావ్, బౌద్ధసంఘాల నాయకులు బల్ల నాగభూషణం, జీవీ ర్యూస్లీ లక్ష్మి, నేలపూడి బాలరాజు, గునుపూడి అరుణబాబు, బోరా లోకేశ్వరరావు, వెయ్యాల సిద్ధార్థ, జానుబాబు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండపై జన సందోహం

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద కనుమ పండుగను పురస్కరించుకొని జరిగే తీర్థానికి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఈ తీర్థాన్ని తిలకించేందుకు జిల్లాలో పలు గ్రామాల నుంచి ప్రజలు పోటెత్తారు. ఏటా ఈ తీర్థాన్ని చూసేందుకు కుటుంబాలతో సహా వచ్చి ఆస్వాదిస్తారు. ఈ సందర్భంగా తీర్థంలో రకరకాల తినుబండారాల దుకాణాలు, పంచదార చిలకలు, పతంగుల పోటీలు, రంగుల రాట్నాలు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రకరకాల ఆట వస్తువులు ఆకట్టుకున్నాయి. ఇక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి సుబ్బరాజు, ట్రైనీ డిఎస్‌పి జి.భవ్యరెడ్డి పర్యవేక్షణలో 100 మంది ప్రత్యేక పోలీసు బందోబస్తు చేపట్టారు.

బొజ్జన్న కొండకు తరలివచ్చిన జనం

సంప్రదాయ దుస్తులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. మకర సంక్రాంతిని పురస్కరించుకొని స్థానిక పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో సంప్రదాయ దుస్తుల ధారణపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి టిడిపి బీసీ సాధికారత సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ వై.నరసింహారావు, వాసవి క్లబ్ అధ్యక్షులు కెవి.సత్యనారాయణ, జగన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఒకే విస్తరిలో భోజనం చేస్తున్న బొడ్డేడ కుటుంబీకులు

ఒకే ఆకులో సహఫంక్తి భోజనం

ప్రజాశక్తి- అనకాపల్లి : కనుమ పండగ రోజున అనకాపల్లి గవరపాలెనికి చెందిన టిడిపి అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి కుటుంబీకులు ఏటా మాదిరిగానే ఒకే ఆకులో సహఫంక్తి భోజనం చేసి సమైక్యతను చాటుకున్నారు. గడిచిన 5 దశాబ్దాల కాలంగా కుటుంబ పెద్దల ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగ, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కనుమ పండుగ రోజు గవరపాలెం చేరుకుంటారు. తమ పూర్వీకుల నివాసాల వద్దకు వచ్చి కనుమ పండుగ చేసుకుంటారు. బొడ్డేడ మురళి నేతృత్వంలో 60 మంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి వీరభద్రరావు, బివి.రామ్ తదితరులు

18న ఎదురులేని మనిషి ఆడియో రిలీజ్

ప్రజాశక్తి- అనకాపల్లి : కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న విశాఖలో ఎదురులేని మనిషి ఆడియో సీడీ ఆవిష్కరిస్తామని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ తెలిపారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసంలో మంగళవారం 'ఎదురులేని మనిషి' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బివి.రామ్ మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి సాగిస్తున్న ప్రజా కంటక పాలనను కళ్లకు కట్టే విధంగా ఇప్పటివరకు తాము ఏడుపాటలను విడుదల చేశామన్నారు. ఆ ఏడు పాటలు మంచి జనాదరణ పొందాయని, ఇప్పుడు "ఎదురులేని మనిషి" టైటిల్‌తో ఎనిమిదో పాటను విడుదల చేస్తున్నామన్నారు. తెలుగు జాతి అభివృద్ధి, సంక్షేమం కోసం కోసం నందమూరి తారక రామారావు పాటుపడితే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలను నిలువునా మోసం చేస్తూ, ఎప్పటికప్పుడు న్యాయస్థానాల ద్వారా మొట్టికాయలు తింటున్నారన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ, తెలుగు జాతి ఉన్నంతవరకు 'ఎదురులేని మనిషి' ఎన్‌టిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దాల కృష్ణ, బొలినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ విన్నర్‌కు అభినందన

ప్రజాశక్తి -ఉక్కునగరం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి ఎంబిఎ (మార్కెటింగ్)లో గోల్డ్ మెడల్ అందుకున్న స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం సీనియర్ మేనేజర్ ఎ.గోపాల్‌ను ఉక్కు సిఎమ్‌డి అతుల్ భట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ అండ్ఎ మేనేజర్ ఎస్.బలరాం, జనరల్ ఫోర్‌మ్యాన్ జి.ఆనంద్ పాల్గొన్నారు.

సంఘ సేవకులకు పురస్కారాలు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ప్రజాశక్తి -అనకాపల్లి : పలు రంగాల్లో విశేష సేవలందించే సంఘ సేవకులకు డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఇచ్చే స్మారక పురస్కారాలను సోమవారం స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఉప్పల చంద్రశేఖరరావు కళ్యాణ మండపంలో అందించారు. ముఖ్యఅతిథిగా పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.శివశంకర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ కొణతాల రామ లింగస్వామి వ్యవసాయ శాస్త్రవేత్తగా ఈ ప్రాంత రైతుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. సంఘ సేవ రంగం నుంచి చిలుకూరి శ్రీనివాసరావు (కడియం), మార్గం రాజేష్ (హైదరాబాద్), పి.తిరుపతిరావు పట్నాయక్ (అచ్యుతాపురం), రాపర్తి జగదీష్ కుమార్ (విజయనగరం), సురకాసి రవితేజ (విశాఖపట్నం), విల్లూరి భార్గవ్ (విద్యా రంగం), జీరెడ్డి తరుణ్‌కుమార్ (సదా ఫౌండేషన్)కు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కొణతాల లక్ష్మీపార్వతి, మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.వీరభద్రరావు, సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు, కాండ్రేగుల సత్యనారాయణ, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ మళ్ల జగదీష్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

18న ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని ఈ నెల 18న పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు తెలిపారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవి.నారాయణరావు మాట్లాడుతూ, ఎన్నికలకు 85 రోజులు మాత్రమే ఉందని, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ సభ్యులు, అనుబంధ సంస్థల కమిటీ సభ్యులు, ఎన్‌టిఆర్, బాలకృష్ణ ఫ్యాన్స్ సభ్యులు, పార్టీ సానుభూతిపరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్లమెంటు కార్యాలయం కార్యదర్శి బొడిశెట్టి శ్రీనివాసరావు, కుప్పిలి జగన్, మళ్ల గణేష్, పూడి త్రినాథ, దూలం ప్రసాద్, బొడ్డేడ మురళి, కాయల ప్రసన్న, బీసెట్టి హేమ, కాండ్రేగుల సత్యనారాయణ, బుద్ధ భువనేశ్వరరావు, షేక్ రియాజ్, సిమ్మటి రామకృష్ణ, వేగి కృష్ణ, సాలాపు నాయుడు, బొబ్బిలి నర్సింగరావు, తిప్పాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగ జగదీష్

ఫార్మా కాలుష్యంతో విషాదం

ప్రజాశక్తి - పరవాడ: ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలైన వ్యర్థ జలాలను తాగి తాడి గ్రామ పరిసరాల్లో రెండు ఆవులు సోమవారం మృతి చెందడం చాలా బాధాకరమని జనసేన పార్టీ నాయకులు గొన్న రమాదేవి విచారం వ్యక్తంచేశారు. పరవాడ రాంకీ ఫార్మాసిటీ పరిశ్రమల వల్ల పరవాడ మండలంలోని ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేనప్పటికీ, దాని కాలుష్యంతో మాత్రం మండల ప్రజలు ఆనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఆరోగ్యాలు పాడైపోయి, నిరుద్యోగం పెరిగిపోయి, వ్యవసాయం కలిసి రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రీన్ బెల్ట్ నిబంధనలను ఉల్లంఘించి కనీస దూరం పాటించకుండా తాడి, తానాం గ్రామాలకు ఆనుకొని పరిశ్రమలను నిర్మించి రోజూ విపరీతమైన కాలుష్యాన్ని ఫార్మా పరిశ్రమలు వెదజల్లుతున్నాయన్నారు. లాభాపేక్షే ధ్యేయంగా, ప్రజలు ఏమైపోయినా పరవాలేదని భావించి, పరిశ్రమల నుంచి ప్రమాదకరమైన రసాయనాలను కాలువల్లోకి వదిలి మూగజీవాల మృతికి కారణమవుతున్నాయని తెలిపారు. పరిశ్రమల వ్యర్థ జలాలను పైపులైన్ ద్వారా తరలించాలని డిమాండ్‌చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువల్లోకి వదులుతున్న వ్యర్థ జలాల వల్ల తాడిలో మృతి చెందిన ఆవుల యజమానులకు తాడి పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల యాజమాన్యాలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫార్మా డెవలపర్ పేరుతో వ్యవహరిస్తున్న రాంకీ ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఎందుకు మౌనం వహిస్తుందో చెప్పాలన్నారు. అధికార పార్టీ అండతో రాంకీ వ్యవహరిస్తున్న తీరును ఆమె తప్పు పట్టారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు తాడి గ్రామ ప్రజలను సంరక్షిత ప్రాంతాలకు తరలించి, వేరొక చోట పునరావాసం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

వాడవాడలా పండుగ సందడి

-ఉత్సాహంగా ముగ్గుల పోటీలు -విజేతలకు బహుమతుల ప్రదానం

గొలుగొండలో ముగ్గును పరిశీలిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సంక్రాంతి పండగ సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

కోటపాడు:మండలంలోని పాతవలస గ్రామంలో మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు గ్రామస్తులతో కలిసి సంక్రాంతి సంబరాలు మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల, యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు పైలా బహుమతి ప్రధానం అందజేశారు. ఈ కార్యక్రమంలో జామి ఈశ్వరరావు, రావాడ అచ్చం నాయుడు, కోండ్రపు మురళి, సర్పంచ్ వెలగల పైడునాయుడు, మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సర్పంచు దాసరి సూర్య కుమారి, సచివాలయ కన్వీనర్ వరహాలు, రాజన్న యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రొబ్బువర కుమారి, ప్రగడ నాగేశ్వరరావు, రాజన్న యూత్ అధ్యక్షుడు చేపూరి నాగేశ్వరావు, గ్రామ పెద్దలు వెచ్చం చిన్న నాగరాజు, చింతాడ ముసలు దొర, పచ్చికొర వరహాలు, కొంగ రాజారావు, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రగడ నాయుడు బాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: సంక్రాంతి పురస్కరించుకొని మూడవ రోజు జరిగే కనుమ పండగను మండలంలో ఘనంగా చేసుకున్నారు. పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధువులు రాకతో గ్రామాలు సందడిగా మారాయి.

కోటవురట్ల: పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సుంకపూరు గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గెలుపొందిన వారికి జనసేన నాయకురాలు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మి శివ పార్వతి బహుమతులు అందజేశారు. పాములవాక గ్రామంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాపిరాజు కొత్తపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ లింగన్న నాయుడు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పొందూరు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

సబ్బవరం:మండలంలోని మొగలిపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన మహిళల కు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గండి రవికుమార్, తమరాన బంగారు నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువతులు, మహిళలు హాజరై ముగ్గులు వేశారు. నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురం ఎస్సీ కాలనీ పాతవీధిలో కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పుత్తడిగైరంపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు.

గొలుగొండ:సంక్రాంతి పండగ సందర్భంగా లింగంపేట పంచాయతీలో టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విజేతలకు టీడీపీ నాయకులు బహుమతులు అందజేశారు.

గొలుగొండ:జనసేన పార్టీ గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబల్ల శివ, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు గండం దొరబాబు ఆధ్వర్యంలో గొలుగొండ మండలం సిహెచ్.నాగపురం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, బాబు సాల్లదుల ప్రసాద్, సుబ్బారావు, రమేష్, వినయ్, సాయి శివ పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి మండలం వాడపాలెం గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సురాడ మాధవి ప్రథమ స్థానంలో, కె.శ్రావణి రెండో స్థానంలో నిలిచారు. వారితోపాటు పోటీల్లో పాల్గొన్న 20 మంది మహిళలకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, వాడపాలెం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జి.రమణ, వి.శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.రామకృష్ణ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ, సంక్రాంతి సందర్భంగా యువతలో స్నేహభావం, మతసామరస్యం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వై.రాము, ఎం.సోమేష్, జి.రమణ, ఎస్.శివాజీ, జి.నానిబాబు, జి.లోవరాజు, ఎస్.లోవరాజు, జి.శంకర్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట, భోగాపురం గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. తిమ్మరాజుపేటలో సర్పంచ్ సరగడం భాగ్యలక్ష్మి, బాపునాయుడు, దుర్గాభవాని కోలాటం బృందం ఆధ్వర్యాన జిల్లాస్థాయి పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, బాపునాయుడు, కర్రి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యాన తిమ్మరాజుపేట గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ సర్పంచ్ ఎస్.లక్ష్మి, జగ్గారావు ద్వారా బహుమతులు అందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.మణికి వాషింగ్ మిషన్ అందజేశారు.

భోగాపురం గ్రామంలో సర్పంచ్ లాలం లక్ష్మి, పైడికొండ ఆధ్వర్యాన జిల్లా స్థాయి ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన ముగ్గులు, ఉట్టి కొట్టుట, బాలబాలికల నృత్య పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ ఎస్.భాగ్యలక్ష్మి, బాపునాయుడు, టిడిపి బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి ఆదిబాబు, జనసేన నాయకులు సరగడము నాగార్జున, చినబాబు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఎ.ఎస్.పేట గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మలసాల ధనమ్మ పాల్గొన్నారు.

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ రాముడిగారి గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. నృత్యాలు, గానాలు, ముగ్గుల పోటీలతో ప్రజలను ఆకట్టుకునే విధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలకు పరవాడ మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, నాయుడుపాలెం గ్రామ పెద్దలు కెవిఎన్ఎన్.మూర్తి, కుండ్రపు శ్రీరామమూర్తి, సర్పంచ్ కూడ్రపు వరలక్ష్మి, సీతారామయ్య హాజరయ్యారు.

నినాదాలు చేస్తున్న రైతులు

చెరుకు రైతుల ఆందోళన

ప్రజాశక్తి- కే.కోటపాడు: చెరుకు తూనిక కేంద్రాల వద్ద పేరుకు పోతున్న చెరుకును తక్షణమే ఫ్యాక్టరీకి తరలించాలని, ఇందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న లారీల కాంట్రాక్టర్‌పై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎ భీమవరం చెరుకు కాటా వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ మాట్లాడుతూ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా.. సకాలంలో చెరుకు తరలింపులో ఫ్యాక్టరీ యాజమాన్యం విఫలమైందన్నారు. కాంట్రాక్టర్ తగినన్ని లారీలను ఏర్పాటు చేయకపోవడంతో వారాల తరబడి కాటాల వద్ద చెరుకు ఎండిపోయి రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. తక్షణమే తగినన్ని లారీలను ఏర్పాటు చేసి చెరుకును తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తర్రా నారాయణరావు, తర్రా అప్పారావు, మహేష్ కుమార్, గంగు నాయుడు, కోన దుర్గేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛను ఇస్తున్న డిప్యూటీ సిఎం బూడి

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి:మండలంలోని వెంకట్రాజు పురం గ్రామంలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు.అదే గ్రామానికి చెందిన లెక్కల పెంటయ్య ఆకాల మరణం చెందాడు. మృతుడి భార్య లెక్కల ఉమాదేవికి వైఎస్సార్ భీమా 1,00,000 రూపాయల నగదును తారువలోని డిప్యూటీ సియం క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అందజేశారు. ఆయన వెంట వెంకటారాజుపురం గ్రామ సర్పంచ్ దాసరి సంతోష్ ఉన్నారు.

గ్రామాల్లో తీర్థాలు ఆరంభం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నక్కపల్లిలో వెంకన్నను ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉపమాక గ్రామం లో మంగళవారం కన్నుల పండువుగా కనుమ పండుగ ఘనంగా జరిగింది. కనుమ సందర్భంగా వెంకన్న ఆలయంలో వెంకటేశ్వర స్వామి రాజాధి రాజ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సంవత్సరం కనుమ పండుగ స్వామివారి ఉత్సవ మూర్తులను రాజాధిరాజ అలంకారంలో పుణ్య కోటి వాహనంలో గిరి ప్రదక్షిణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం బంధుర సరస్సు వద్ద మండపంలో ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. వెంకన్న ఆలయ ప్రాంతం భక్తుల రద్దీతో జనసంద్రంగా మారింది.

ఉపమాక లో తీర్థం

కనుమ సందర్భంగా ఉపమాక గ్రామంలో సాయంత్రం తీర్థం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దలు, పిల్లలు ఉపమాక చేరుకుని తీర్థం లో సందడి చేశారు. తాడి పెద్దుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది .

సబ్బవరం:మండలంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ (టిటిడి) సౌజన్యంతో ఆరిపాక పంచాయతీ శివారు చినయాతపాలెం గ్రామంలో కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం గోమాత పూజ, , ఊరేగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎంపిటీసీ మళ్ల కోటేశ్వరరావు, దొడ్డి మహేశ్వరరావు, శరగడం దుర్గ నాయుడు, శరగడం సత్యనారాయణ, మళ్ల సన్నిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి:మండల కేంద్రంలోని అప్పలమ్మ పేరంటాలమ్మ తల్లి తీర్థ మహోత్సవ సందర్భంగా సోమవారం సాయంత్రం ఊరేగింపు ఘనంగా జరిగింది. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించేందుకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ సిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కె.వెలమ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, పరవాడ రవి, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని పాతకృష్ణదేవిపేట గ్రామంలో మంగళవారం తీర్థ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. సర్పంచ్ పందిరి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఉదయం నుంచి వివిధ రకాల కోలాటాలు, తప్పెటగుళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తీర్థం సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

17న నారితల్లమ్మ తీర్థం

దేవరాపల్లి:మండలంలోని ఎన్. గజపతి నగరంలో నారితల్లమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం ఈనెల 17 తేదిన నిర్వహించేందుకు శ్రీ నారితల్లి సేవా కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎడ్ల పందాల పోటీలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తీర్థ మహోత్సవ గోడపత్రికను డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు తారువలోని క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిరికి జగన్నాధ రావు, శ్రీనివాస రావు, వంటాకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి తీర్థంలో నాయకులు, గ్రామస్తులు

సరుకులు ఇస్తున్న సంస్థ సిబ్బంది

పేదలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-చీడికాడ: మండలం జి.కొత్తపల్లి గ్రామంలో పేదలకు హెక్టర్లక్ కంపెనీ డిబి ఎస్ ఫౌండేషన్ సంస్థలో పని చేస్తున్న సిబ్బంది నాగరాజు సతీష్, నాని బాబు, సూకరాజు, మహాలక్ష్మీ నాయుడు వంట సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముందు ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

పివిటిజిల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-అరకులోయ :ఆదివాసీల (పివిటిజిలు) సంక్షేమమే కేంద్ర ప్రభుత్వం ఆశయమని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అరకులోయ మండలం కొత్త భల్లుగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన వర్చువల్ ముఖాముఖి సమావేశంలో ఆయన ఆదివాసీ గిరిజనులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు మారుమూల గిరిజనులకు చేరితేనే నిజమైన అభివృద్ధి అని స్పష్టం చేసారు.అర్హులైన పివిటిజిలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కొడవటిపూడి ప్రధాన రహదారి

రహదారు(ణా)లు

-రోడ్లపై గోతులతో తప్పని అవస్థలు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో నర్సీపట్నం-పోలవరం ప్రధాన రహదారి మినహా గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. అయినా నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ప్రధాన గ్రామాలకు వెళ్లే రహదారులు ఛిద్రమై దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు వెంకటాపురం, కొడవటిపూడి రహదారి పూర్తిగా ఛిద్రమైంది. రాజుపేట, చౌడువాడ రహదారులు ప్రయాణించేందుకు అనుకూలంగా లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైంది. అయినా పట్టించుకున్న నాధుడే లేడు.ప్రధాన రహదారి పోలవరం రోడ్డు ఇందేశమ్మ పాక నుండి పందూరు వచ్చే వరకు ప్రజలు ప్రయాణించేందుకు నరకం చూస్తున్నారు. అధికారులు, నాయకులు మారుతున్నా..పట్టించుకోలేదని గిరిజన గ్రామాలైన అనుకు, కోదండరామపురం, తడపర్తి, గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు ఇప్పటికైనా స్పందించి రహదారులు బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జల్లూరు వంతెన వద్ద

మ్యానిపెస్టోను ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలో పిపి అగ్రహారం శివారు గొర్లేపాలెం, ఉప్పరగూడెం గ్రామాల్లో తెదేపా మినీ మేనిఫెస్టోను మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం, అభివృద్ధి పాలన వస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగత పాలు అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుర్రం నూకరాజు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యంలోని పర్యాటక కేంద్రాలు సందర్శకులతో కిటకిటలాడాయి. అనంతగిరి మండలం బొర్రా గుహాలు, కటికి, తాటిగూడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాలకొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కొత్తవలస వ్యవసాయ శిక్షణ కేంద్రం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగూడ మండలంలోని చాపరాయి, పాడేరు మండలంలో వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జల్లిపాతం, చింతపల్లి మండలంలో తాజంగి, చెరువువేనం, లంబసింగి ప్రాంతాలను అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. దీంతో సంక్రాంతి, కనుమ రోజుల్లోనూ పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కలకలలాడాయి.

పండుగ వేళా..సమ్మె శిబిరాల్లోనే...

-కొనసాగిన అంగన్వాడీల వినూత్న నిరసనలు

దేవరాపల్లిలో గడ్డితో నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

విశాఖలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి వినతిపత్రాలు ఇస్తూ వేడుకుంటున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

పండుగ వేళా కూడా అంగన్‌వాడీలు సడలని సంకల్పంతో సమ్మెను మంగళవారం కొనసాగించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో వినూత్నంగా నిరసనలు చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నక్కపల్లి:సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 36వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద అంగన్వాడి వర్కర్స్ పిండి వంటలు వండుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ పట్ల మొండి వైఖరి ప్రదర్శించడంతో పండగ పూట కూడా ఇంటి దగ్గర ఉండకుండా ఆందోళన చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసారు. 36 రోజుల నుండి తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నేటి వరకు సమస్యల పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ పాల్గొన్నారు .

నక్కపల్లిలో వంటను చేస్తూ నిరసన

సబ్బవరం:మండలంలోని అంగన్వాడీల రిలే దీక్షలు 36 వ రోజు నిరసనలు కొనసాగాయి. ఈ సందర్భంగా అంగన్వాడీలకు మల్కాపురం జోన్ సీపీఎం నాయకులు పి.పైడిరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా అంగన్వాడీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, డి.పుష్ప, ఎస్.జగదీశ్వరి, ఆర్.శివరామలక్ష్మీ, వి. సుభాషిణి, ఎం.కనకమ్మ, జి.అరుణ కుమారి, ఎస్. రమణమ్మ, డి.భారతి, ఎ.రమణమ్మ, పి.సూరమ్మ, ఎన్. సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి:స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అంగన్వాడీలు ఆకులు చేతపట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆనందపురంలో...

కె.కోటపాడు: మండలంలో అంగన్వాడీల సమ్మె 36వ రోజుకు చేరుకుంది. కనుమ ముగ్గులు వేసి జగనన్న పండగ మీకా! పస్తులు మాకా! అంటూ నోట్లో ఆకులు పెట్టుకుని మోకాళ్ళ పై నిలబడి నిరసన చేపట్టరు. తెలంగాణాలో కన్నా వెయ్యి రూపాయల వేతనం పెంచుతామని నమ్మించి మోసం చేసి పండుగ పూట పస్తులు పెట్టారని ప్రాజెక్టు అద్యక్షులు భవానీ, గౌరవ అధ్యక్షురాలు జి.కూమారి ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గండి నాయనిబాబు, యర్రా దేముడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి లక్ష్మీ, లక్ష్మీ, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

గొలుగొండ:సమస్యలు పరిష్కరించాలని మంగళవారం గొలుగొండలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, గత 36 రోజులుగా అంగన్వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు.ఎస్మా వంటి జిఒలతో బెదిరింపు చర్యలకు పాల్పడు తుందన్నారు.

పరవాడ: సమ్మెలో భాగంగా పరవాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ

గొలుగొండలో మోకాళ్లపై ...

కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.రమణి, సిహెచ్.దేవి, వై.అనిత, పి.రత్నకుమారి, కె.రత్నం, బి.లక్ష్మి, ఆర్.కనక, కె.రమణమ్మ, పి.అప్పలకొండ, ఎం.వరలక్ష్మి, జె.శాంతమ్మ, ప్రియ, ఆర్.లక్ష్మి, పి.దేవి, సుజాత, ఎం.దేవి, జె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లిలో సంక్రాంతి ముగ్గులు, పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాసులమ్మ, ఉమా నారాయణమ్మ, ఆదిలక్ష్మి, శ్యామల, ఇస్తేర్‌రాణి, వెంకటలక్ష్మి, మున్నిసా, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: మునగపాకలో 'పండగ మీకు.. పస్తులు మాకా, అంటూ నినాదాలు చేశారు. ఈ శిబిరాన్ని అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు పెంటకోట జగన్నాథరావు నాయుడు సందర్శించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, రామలక్ష్మి, జయలక్ష్మి, అంజలి, తులసి లక్ష్మి, హేమలత, సరస్వతి, సత్యవతి, రాణి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్దనున్న సమ్మె శిబిరంలో మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి, నూతన వస్త్రాలు సమర్పించి వినూత్నంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. 'రాజన్నా జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధులు ప్రసాదించి మా జీతాలు పెంచే విధంగా చూడు' అని వేడుకున్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, జీతాలు పెంచకుండా బెదిరింపు చర్యలకు పూనుకుంటోందని అన్నారు. అంగన్‌వాడీల పోరాటం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా మిగులుతుందన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే అన్ని ప్రజా సంఘాలనూ కలుపుకుని సిఎం తాడేపల్లి ప్యాలస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు ఎవ్వరూ బెదరొద్దన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.తులసి, సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, ఆర్.లక్ష్మణమూర్తి, వి.తులసీరామ్, ఎఐటియుసి నాయకులు పడాల రమణ, అచ్యుతరావు, ఎస్ఎఫ్ఐ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి రాజా, ప్రజారోగ్య వేదిక నాయకులు టి.కామేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ లీడర్లు వెంకటలక్ష్మి, శ్యామలా దేవి, శోభారాణి, నాగేశ్వరి, రామలక్ష్మి, రాధారాణి, ఉమా, నూకరత్నం పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం కూడలి వద్ద ధర్నా చేశారు. ఈ శిబిరాన్ని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మణి, మధురవాడ సిఐటియు నాయకులు అప్పలరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిరణ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ సెక్రటరీ రవ్వ నర్సింగరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎస్.లక్ష్మి, సత్యవతి, రామలక్ష్మి, కోమలి పాల్గొన్నారు.

మునగపాకలో...